



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

సోమవారం

13-10-2025

పేజీలు: 02




ఏడాది కుమారుడితో కలిసి ట్రైన్ కింద పడి

## దంపతుల ఆత్మహత్య

కడపలో తీవ్ర విషాదం నెలకొంది. తన ఏడాది కుమారుడితో కలిసి భార్యభర్తలు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కడప నగరానికి చెందిన శ్రీరాములు (35)కు శిరీష (30)తో కొంతకాలం క్రితం పెళ్లయింది. వారికి ఏడాది కుమారుడు రుత్విక్ ఉన్నారు. వీరు ముగ్గురు కూడా తమ నానమ్మతో కలిసి శంకరాపురంలో ఉంటున్నారు. అయితే కొద్దిరోజుల నుంచి భార్యభర్తలు శ్రీరాములు, శిరీష తరచూ గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో సుబ్బమ్మ వారిని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీరాములు తన భార్య, కొడుకుతో కలిసి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మనమడు ఇంటి నుంచి వెళ్లిపోవడంతో దిగులు చెందిన నానమ్మ గుండెపోటుతో మరణించింది. మరోవైపు ఇంటి నుంచి వెళ్లిన శ్రీరాములు మనస్తాపంతో తన భార్య, కుమారుడితో కలిసి కడప రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అర్ధరాత్రి 11 గంటల సమయంలో రైల్వే స్టేషన్ సమీపంలోని మూడో నంబర్ ట్రాక్‌పై వస్తున్న గూడ్స్ రైలు కింద పడ్డాడు. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. కాగా, భార్యాభర్తలకు ఎందుకు గొడవ అయ్యింది? సుబ్బమ్మ వారిని ఎందుకు మందలించింది.. ఆత్మహత్య చేసుకోవాల్సినంత పరిస్థితి ఏమొచ్చింది.. తదితర వివరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## యూపీలో దారుణం

టీచర్ కొట్టాడని ఆయన భార్య, పిల్లలను

## చంపిన విద్యార్థులు

బీజేపీ పాలిత ఉత్తర ప్రదేశ్‌లోని బాగ్‌పట్ జిల్లాలో ఆదివారం దారుణం జరిగింది. ఇద్దరు మైనర్లు టీచర్‌పై పగబట్టి, ఆయన భార్య, పిల్లలను కిరాతకంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గంగ్నౌలీలోని ఓ మసీదు ప్రాంగణంలో స్థానిక బాలలకు ముఫ్తీ ఇబ్రహీం మతపరమైన విద్యను బోధిస్తూ ఉంటారు. ఆయన చేత దెబ్బలు తిన్న ఇద్దరు మైనర్లు ఆయనపై పగ పెంచుకున్నారు. వీరిద్దరూ ఓ సుత్తి, ఓ కత్తి తీసుకుని, ఆయన ఇంట్లో లేని సమయంలో, ఆయన భార్య ఇస్రానా, కుమార్తెలు సోఫియా (5), సుమైయా (2)లను దారుణంగా హత్య చేశారు. దీంతో స్థానికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. నిందితులిద్దర్నీ పోలీసులు అరెస్ట్ చేశారు.



## రైల్వే ట్రాక్ మరమ్మతులు..

## 32 రైళ్లు రద్దు

డోర్నకల్-పాపటపల్లి మార్గంలో మూడో లైన్ మరమ్మతుల కారణంగా.. వచ్చే శనివారం వరకు 32 రైళ్లను రద్దు చేసినట్లు, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేసి, రీషెడ్యూల్ చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. విశాఖపట్నం-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్, స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, SEC-గుంటూరు ఇంటర్‌సిటీ, పూరి-ఓకా ద్వారకా ఎక్స్‌ప్రెస్, డోర్నకల్-కాజీపేట, విజయవాడ-డోర్నకల్ మధ్య నడిచే మెమో ప్యాసింజర్ రైళ్లు రద్దు చేయబడ్డాయి. ADB-తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-SEC వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఆలస్యంగా నడుస్తాయి. SEC-గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 14 నుంచి 18 వరకు కాజీపేట-గుంటూరు మధ్య పాక్షికంగా రద్దు చేయబడింది.

# అర్ధరాత్రి ఆమె బయటకు ఎందుకు వచ్చింది?

### గ్యాంగ్‌రేప్‌పై మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు

ఘటనపై స్పందించిన బెంగాల్ సీఎం మమత బెనర్జీ

విద్యార్థుల భద్రత కాలేజీ యాజమన్యాలేదనన్న దీదీ



పశ్చిమ్ బెంగాల్‌లో మరో వైద్య విద్యార్థిని సామూహిక అత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. దుర్గాపూర్‌లో ప్రయివేట్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతోన్న 23 ఏళ్ల విద్యార్థిని శుక్రవారం రాత్రి తన స్నేహితుడితో ఉండగా.. ముగ్గురు యువకులు అతడ్ని బెదిరించి ఆమెను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. ఈ ఘటనపై బెంగాల్‌తో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఘటనపై బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తొలిసారి స్పందించారు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఆమె బయటకు ఎందుకు వెళ్లారని దీదీ ప్రశ్నించారు. ప్రయివేట్ కాలేజీల్లో విద్యార్థుల భద్రత పూర్తిగా యాజమాన్యాలే వహించాలని పరోక్షంగా స్పష్టం చేశారు. 'ఆమె ప్రయివేట్ మెడికల్ కాలేజీలో చదువుతోంది.. ఆమె అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో బయటకు వెళ్తే దీనికి బాధ్యత ఎవరిది?' అని నిలదీశారు. ఈ ఘటన దిగ్భ్రాంతికి గురిచేసిందన్న సీఎం మమత.. బెంగాల్ పోలీసులు అవసరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రయివేట్ మెడికల్ కాలేజీలు తమ విద్యార్థుల భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి సమయంలో వారు బయటకు వెళ్లే విషయంలో పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. 'విద్యార్థులను బయటకు రావడానికి అనుమతించవద్దు' అని బెనర్జీ అన్నారు. ఒడిశాలోని జలేశ్వర్‌కు చెందిన బాధిత యువతి... దుర్గాపూర్‌లోని ఐక్యూ సిటీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ రెండో ఏడాది చదువుతోంది. శుక్రవారం రోజు రాత్రి ఆమె తన స్నేహితుడితో కలిసి క్యాంపస్ నుంచి బయటికి వెళ్లింది. క్యాంపస్ గేటుకు సమీపంలో వాళ్లు ఉండగానే.. గుర్తుతెలియని ముగ్గురు యువకులు వారిని అడ్డుకున్నారు. ఆమె స్నేహితుడ్ని బెదిరించి అక్కడి నుంచి పంపేశారు. అనంతరం ఆమెను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె మొబైల్ ఫోన్, పర్సులో ఉన్న రూ.5 వేల నగదును తీసుకుని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలు చెప్పిన వివరాలు ఆధారంగా ముగ్గురు అనుమానితులను బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. గతేడాది కోల్‌కతా ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో పీజీ రెసిడెంట్ డాక్టర్ హత్యాచార ఘటన దేశం మొత్తాన్ని కుదిపేసిన సంగతి తెలిసిందే. అలాగే, ఈ ఏడాది జులైలో లో కస్బాలోని ఓ లా కాలేజీ ప్రాంగణంలో న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది. తరుచూ బెంగాల్‌లో ఇటువంటి ఘటనలు ఆ రాష్ట్రంలో మహిళల భద్రతపై అనేక సందేహాలు లేవనెత్తుతున్నాయి. మహిళా ముఖ్యమంత్రి ఉన్నా.. రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ కరువైందని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ముఖ్యంగా బీజేపీ.. దీదీ సర్కారుపై ఒంటికాలితో లేస్తోంది. వచ్చే ఏడాది మార్చిలో బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండగా.. బీజేపీ తన ప్రచార అస్త్రంగా మలచుకునే ఉద్దేశంలో ఉంది.

## కోట వినుత డ్రైవర్ రాయుడు సంచలన వీడియో



హత్యకు ముందు రికార్డ్ అయిన కోట వినూత డ్రైవర్ వీడియో

గడిచిన కొద్ది రోజుల క్రితం జనసేన పార్టీ మాజీ నేత వినుత డ్రైవర్ రాయుడు హత్య కేసు జరగడం ఏపీ అంతట సంచలనంగా మారింది. ఈ హత్య జనసేన పార్టీ ఇంచార్జ్ కోట వినుత, ఆమె భర్త చంద్రబాబు చేయించారనే ఆరోపణలతో అరెస్టు కూడా అయ్యారు. అయితే ఇప్పుడు తాజాగా డ్రైవర్ రాయుడు కేసులో ఒక బిగ్ ట్విస్ట్ చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. అదేమిటంటే డ్రైవర్ రాయుడు షాకింగ్ సెల్ఫీ వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వీడియోలో ఎన్నో సంచలన విషయాలు కూడా బయటపెట్టినట్లు కనిపిస్తోంది. ఎన్నికలకు ముందు టిడిపి నేత బొజ్జల-గురించి లేటెస్ట్ అప్డేట్స్, ఫోటోలు, వీడియోల కొరకు వెంటనే క్లిక్ చేయండి. బొజ్జల సుధీర్ రెడ్డితో తాను టచ్ లో ఉన్నట్లుగా ఈ సెల్ఫీ వీడియోలో తెలియజేశారు. తనని పేట చంద్రశేఖర్, సుజిత్ రెడ్డి, సాయి ప్రసాద్ అనే ముగ్గురు వ్యక్తులు పరిచయం చేశారని. వినూతకు సంబంధించి విషయాలను చెబితే 2024 ఎన్నికలకు ముందు రెండు లక్షల రూపాయలు ఇచ్చారని తెలిపారు రాయుడు. వినూత అసభ్యకరమైన దృశ్యాలను పంపితే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల-గురించి లేటెస్ట్ అప్డేట్స్, ఫోటోలు, వీడియోల కొరకు వెంటనే క్లిక్ చేయండి. '>బొజ్జల సుధీర్ రెడ్డి తనకు రూ .30 లక్షల రూపాయలు ఇస్తానని చెప్పి అడ్వాన్స్ కింద రూ.2 లక్షలు ఇచ్చారని ఈ వీడియోలో తెలియజేశారు. అంతేకాకుండా వినుత, చంద్రబాబును చంపాలని సుధీర్ రెడ్డి చెప్పిన రెండుసార్లు యాక్సిడెంట్ ప్రయత్నించిన కుదరలేదని మేడం వినూత నువ్వు కావాలని ఇలాంటివి చేస్తున్నావని డ్రైవర్ గా పనిలో నుంచి తీసేసారని తెలిపారు రాయుడు. వినుత ప్రైవేట్ వీడియోలు కావాలని బొజ్జల-గురించి లేటెస్ట్ అప్డేట్స్, ఫోటోలు, వీడియోల కొరకు వెంటనే క్లిక్ చేయండి. '>బొజ్జల సుధీర్ రెడ్డి తనని ఎన్నోసార్లు బెదిరించే వారంటూ తెలిపారు. కానీ బెడ్రూంలో కెమెరాలు, మొబైల్ రికార్డింగ్ వంటి వాటిలో వీడియోలు తీస్తున్న సమయంలో తాను దొరికిపోయానంటూ తెలియజేశారు రాయుడు. అయితే ఈ విషయంపై వినుత మేడంకి చెప్పిన ఆమె నమ్మలేదని తెలిపారు. ఈ వరుస పరిణామాలు అన్నిటిని నేపథ్యంలో జులై 7వ తేదీన డ్రైవర్ రాయుడును కోట వినూత ,ఆమె భర్త చంద్రబాబు హత్య చేశారు. హత్యకు ముందు ఈ సెల్ఫీ వీడియో తీసుకున్నట్లుగా వైరల్ గా మారింది.డ్రైవర్ రాయుడు మరణించడానికి ఒక నెల ముందే డ్రైవర్ని సస్పెండ్ చేసినట్లుగా వినుత సోషల్ మీడియాలో తెలియజేసింది. ఎన్నో ఏళ్ల నుంచి రాయుడు, వినుత దగ్గర నమ్మిన బంటుగా, డ్రైవర్గా ఆమె వ్యక్తిగత సహాయకుడిగా కూడా ఉండేవారు. అయితే జూన్ 21వ తేదీన అతను చేసిన అసభ్యకరమైన ,అనుచితమైన కుట్రపూరితమైన ప్రలోభాలకు లొంగి మాకు ఎన్నో రకాల ప్రధాన గౌరవ అంశాలలో భంగం కలిగించారని అందుకే అతడిని తొలగిస్తున్నామంటూ ఆమె ప్రకటించింది ఇకమీదట డ్రైవర్ రాయుడు కి తమకు ఎలాంటి సంబంధం లేదంటూ కూడా గతంలో ప్రకటించింది.



## మిసెస్ యూనివర్స్‌గా

## షెర్రీ సింగ్

అంతర్జాతీయ అందాల పోటీల్లో భారత పతాకం రెపరెపలాడింది. భారత్‌కు చెందిన షెర్రీ సింగ్ మిసెస్ యూనివర్స్ 2025 కిరీటాన్ని దక్కించుకున్నారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా చరిత్రలో తన పేరును లిఖించుకున్నారు. ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో జరిగిన 48వ ఎడిషన్ పోటీలో ప్రపంచ వ్యాప్తంగా ఆమె 120 మందితో పోటీ పడి కిరీటాన్ని దక్కించుకున్నారు. తొమ్మిదేండ్ల క్రితం వివాహమై ఒక కుమారుడు ఉన్న షెర్రీ సింగ్ విజేతగా నిలిచిన తర్వాత 'ఈ విజయం కేవలం నా ఒక్కదానిదే కాదు. హద్దులు దాటి కలలు కనే ప్రతి మహిళదీ. బలం, దయ, పట్టుదల మహిళ నిజమైన అందానికి నిదర్శనం అని నేను ప్రపంచానికి చూపాలనుకుంటున్నాను' అని పేర్కొన్నారు. తనను విజేతగా ప్రకటించిన తర్వాత ఆమె భారత జెండాను చేతబట్టి తీవ్ర ఉద్వేగానికి గురయ్యారు. చరిత్రాత్మకమైన ఈ విజయం భారత్‌ను గర్వపడేలా చేసిందని మిస్ యూనివర్స్ పోటీ నిర్వాహకులు ప్రశంసించారు. ఆమెకు ఇన్‌స్టాలో 2.5 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు.




## తమిళనాడులో స్విగ్గీ, జోమాటోలపై తిరుగుబాటు

నామక్కల్ జిల్లాలో మొదలై, కడలూరు జిల్లాకు వ్యాపించిన తిరుగుబాటు విప్లవం. స్విగ్గీ, జోమాటో లాంటి ఫుడ్ డెలివరీ యాప్‌లు 30—35% కమిషన్లు తీసుకుంటున్నాయని, తమకు తెలియకుండా డిస్కౌంట్లు ఇస్తున్నాయని, GST కూడా తమ దగ్గరే వసూలు చేస్తున్నారని హోటల్ యజమానుల తిరుగుబాటు. చిన్న చిన్న పట్టణాల్లో ఉండే యజమానులకు చదువు రాక అగ్రిమెంట్ పత్రాలు చదవకుండానే సంతకాలు చేశారని, దీని వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన. పెద్ద యాప్‌లకు పెద్ద మొత్తంలో కమీషన్లు చెల్లించకుండా, స్థానిక వ్యక్తి రూపొందించిన జారోజ్ అనే డెలివరీ యాప్‌తో భాగస్వామ్యం అవుతున్న హోటల్ యజమానులు.

## రకుల్ హాట్ లుక్స్

హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్.. తెలుగు సినిమా ప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు. తెలుగు, తమిళం భాషలలో స్టార్ హీరోలతో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన ఈ అమ్మడు.. ఇప్పుడు బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉంటుంది. కొన్నాళ్ల క్రితం బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీని పెళ్లి చేసుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు తెలుగు సినిమాలకు దూరంగా ఉంటుంది. ఇటీవలే మేరీ హస్బెండ్ కి బీవీ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. ప్రస్తుతం అజయ్ దేవగన్ నటిస్తోన్న దేదే ప్యార్ దే 2 చిత్రంలో నటిస్తుంది. ఈ సినిమాలో ఆర్ మాధవన్, టబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ ఏడాది చివర్లో అడియన్స్ ముందుకు రానుంది. ఈ క్రమంలో తాజాగా రకుల్ కు సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు నెటిజన్స్ దృష్టిని ఆకర్షిస్తుంది.ఇటీవల ముంబై విమానాశ్రయంలో కనిపించింది రకుల్. ఆ సమయంలో ఆమె మెడపై ఓ స్టిక్కర్ కనిపించింది. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో.. రకుల్ మెడ పై ఉన్న స్టిక్కర్ ఏంటా ? అని తెగ సెర్చ్ చేస్తున్నారు.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# రాబోయే మూడేళ్లలో మరిన్ని భారీ పెట్టుబడులు వస్తాయని లోకేశ్ ధీమా

ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధాని అమరావతి కాగా, రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన ఆర్థిక రాజధానిగా విశాఖపట్నాన్ని తీర్చిదిద్దనున్నట్లు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 2047 నాటికి విశాఖను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ప్రకటించారు. విశాఖలో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం రిషికొండలో జరిగిన కార్యక్రమంలో లోకేశ్ ప్రసంగించారు. "ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే మా విధానం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు మా విధానానికే పట్టం కట్టారు. సమర్థ పాలన, ఉద్యోగాల కల్పన, విశాఖను ఆర్థిక రాజధానిగా చేయడం కోసమే 94 శాతం సీట్లతో మమ్మల్ని గెలిపించారు" అని లోకేశ్ అన్నారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందడానికి 30 ఏళ్లకు పైగా సమయం పడితే, విశాఖను అభివృద్ధి చేయడానికి పదేళ్ల సమయం చాలని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇది తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు.విశాఖ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని లోకేశ్ వివరించారు. "గత 17 నెలల్లో రాష్ట్రానికి వచ్చిన 120 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో 50 శాతానికి పైగా గ్రేటర్ విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌కే వచ్చాయి. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్, భారత చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) కూడా విశాఖపట్నానికే రాబోతోంది" అని ఆయన కీలక ప్రకటన చేశారు. ఈ పెట్టుబడుల ద్వారా విశాఖలో శక్తివంతమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాలు, అందులో కేవలం విశాఖలోనే 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు.కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే కూటమి అధికారంలో ఉండటం వల్ల అభివృద్ధి బుల్లెట్ రైలు వేగంతో దూసుకెళుతోందని లోకేశ్ అభివర్ణించారు. "డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోగలిగాం. కేంద్రం రూ.11 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేల కోట్లు అందించి ప్లాంట్‌ను ఆదుకున్నాయి. ప్రస్తుతం మూడు ఫర్నేస్‌లు పనిచేస్తున్నాయి. త్వరలోనే వంద శాతం సామర్థ్యంతో నడిపి లాభాల బాట పట్టిస్తాం" అని




ఆయన వివరించారు. రైల్వే జోన్ సాధించామని, స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నామని గుర్తుచేశారు.ఈ పెట్టుబడులు తీసుకురావడం వెనుక ఎనిమిదేళ్ల కృషి ఉందని లోకేశ్ తెలిపారు. సిఫీ ఛైర్మన్ రాజు వేగేశ్నను 2017లో కాలిఫోర్నియాలో కలిసినప్పటి నుంచి ఈ ప్రయాణం మొదలైందని గుర్తు చేసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ విశాఖకు రావడంలో మంతెన రామరాజు, ఎన్నారై టీడీపీ నేత సాగర్ దొడ్డపనేని, ఐఏఎస్ అధికారి కాటంనేని భాస్కర్ వంటి వారు కీలక పాత్ర పోషించారని అభినందించారు. రాబోయే మూడు నెలల్లో మరిన్ని పెట్టుబడులు విశాఖకు తరలివస్తాయని, ఏ ఒక్క పెట్టుబడి కూడా పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా చూస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## 15న జేఈఈ మెయిన్స్ షెడ్యూల్!

దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాలు కల్పించేందుకు జాతీయస్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షల షెడ్యూల్ రెండు, మూడు రోజుల్లో విడుదలకానున్నది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు ఈ నెల 15న విడుదలయ్యే అవకాశం ఉన్నది. షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఎప్పటిలాగే ఈసారి కూడా రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. జనవరి నాలుగో వారంలో మొదటి సెషన్, ఏప్రిల్‌లో రెండో సెషన్ పరీక్షలుండే అవకాశమున్నది. జేఈఈ అపెక్స్ బోర్డు చైర్‌పర్సన్‌గా ఈ సారి బనారస్ హిందూ యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎస్కే జైన్ నియమితులయ్యారు. జేఈఈ మెయిన్ దరఖాస్తు విధానం 3 దశల్లో ఉంటుంది. మొదట రిజిస్ట్రేషన్, ఆ తర్వాత దరఖాస్తు పూరించి చివరగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.



## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. నేడు (సోమవారం) శ్రీవారి సర్వదర్శనానికి 12 నుంచి 15 గంటల సమయం పడుతోంది. భక్తులు 29 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. క్యూలైన్‌లోని వారికి అన్నప్రసాదం, పాలు, తాగునీరు అందిస్తున్నారు. ఆదివారం 84,424 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 27,872 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.06 కోట్లు వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు.

# 6 సీట్లు అడిగితే పట్టించుకోలేదు..

### బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లలో ఎంఐఎం పోటీ


బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లలో పోటీ చేయాలని మజ్లిస్ నిర్ణయించింది. 16 జిల్లాల్లో 32 మంది అభ్యర్థులతో మజ్లిస్ తొలి జాబితాను విడుదల చేశారు. బిహార్‌లో థర్డ్‌ఫ్రంట్‌కు మజ్లిస్ నేతృత్వం వహిస్తుందని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు.. తాము బీజేపీకి బీటీమ్ అని తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ.. ఇండియా కూటమి పార్టీలపై మండిపడ్డారు. తమకు ఆరు సీట్లు ఇవ్వాలని లేఖ రాస్తే ఆర్జేడీనేత తేజస్వియాదవ్ పట్టించుకోలేదని ఒవైసీ విమర్శించారు. బిహార్ ముస్లిం మతపెద్దల విజ్ఞప్తి మేరకు , బీజేపీని అడ్డుకోవడానికి తాము ''మాకు ఆరు సీట్లు ఇవ్వాలని కోరాం. గత ఎన్నికల్లో మేము ఐదు సీట్లు గెలిచాం. వాళ్లు ఒప్పుకోకపోవడంతో పోటీకి సిద్ధమయ్యాం. విమర్శలు పట్టించుకునే ప్రసక్తే లేదు. బిహార్ ముస్లిం మతపెద్దల విజ్ఞప్తి మేరకు , వాళ్లిచ్చిన లెటర్ పై సంతకం చేశాం.. బీజేపీని ఎవరు అడ్డుకుంటారో తెలిపోతుందని చెప్పాం.. బిహార్‌లో మా రాజకీయ ప్రస్థానం సీమాంచల్ ప్రాంతం నుంచి ప్రారంభమయ్యింది. సీమాంచల్‌కు న్యాయం జరగాలి. ఐదేళ్ల క్రితం మేము దీనిపై సమావేశం కూడా నిర్వహించాం.'' అంటూ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. బిహార్‌లో ముస్లింల జనాభా ఎక్కువగా



ఉండే సీమాంచల్ ప్రాంతంపై ఒవైసీ గురి పెట్టారు. గతంలో ఐదు సీట్లు ఇక్కడి నుంచే గెలిచారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తాము మద్దతిస్తునట్టు వస్తున్న వార్తల్లో నిజంలేదననారు ఒవైసీ. అభివృద్ధిచ కోసం తాము అడిగిన నిధులను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారని అన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పోటీ ఇండి కూటమిపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశాలున్నాయి. అయితే ముస్లిం ఓటు బ్యాంక్ తమవైపే ఉందని చెబుతున్నారు తేజస్వి యాదవ్.

## అమెరికాలో మరోసారి కాల్పులు.. నలుగురు మృతి, 20 మందికి గాయాలు

అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. దక్షిణ కరోలినాలోని సెయింట్ హెలినా దీవిలో తెల్లవారుజామున ఓ దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా.. 20 మంది గాయపడ్డారు. విల్లీస్ బార్ అండ్ గ్రిల్‌లో ఆదివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో జనాలు ఉండటం గమనించిన దుండగులు కాల్పులు జరిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ కాల్పుల్లో నలుగురు చనిపోయారని పోలీసులు తెలిపారు. మరో 20 మంది గాయపడ్డారని.. వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని పేర్కొన్నారు. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. తుపాకీ కాల్పుల నుంచి తప్పించుకునేందుకు అనేక మంది సమీపంలోని షెల్టర్లు, షాపుల్లోకి పరిగెత్తారని వివరించారు.



# డీగ్లామర్ లుక్‌లో..

ఆ బ్యూటీ మృణాల్ ఠాకూర్. సీతారామం సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. మొదటి సినిమాతోనే ఊహించని మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఇందులో సీతామహలక్ష్మి పాత్రలో అద్భుతమైన నటనతో జనాలను కట్టిపడేసింది.ఆ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ చిత్రాల్లో నటించి మెప్పించింది. ఇప్పుడు ఈ అమ్మడు బాలీవుడ్ సినిమాలపై ఫోకస్ పెట్టింది. అలాగే తెలుగులోనూ ఒక సినిమా చేస్తుంది. అదే డెకాయిట్. ఇందులో అడివి శేష్ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాకు ఆమె రూ.2.5 కోట్లు పారితోషికం తీసుకుంటుందని సమాచారం. అలాగే ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ డిమాండ్ ఉన్న హీరోయిన్లలో ఆమె ఒకరు. బుల్లితెర నుంచి సిల్వర్ స్క్రీన్ వరకు ఆమె ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తి. సోషల్ మీడియాలో ఈ బ్యూటీకి విపరీతమైన క్రేజ్ ఉంది. అటు చీరకట్టులో.. ఇటు గ్లామర్ లుక్కులో మెస్మరైజ్ చేస్తుంది మృణాల్. ఇటీవల ఆమెకు సంబంధించిన ఓ త్రోబ్యాక్ వీడియో నెట్టింట వైరలవడంతో మృణాల్ తీరుపై నెటిజన్స్ మండిపడ్డారు.





హారిజన్ క్రికెట్ అకాడమీ బాక్స్ టోర్నమెంట్ క్రికెట్ పోటీలు నిర్వయించారు. వైట్ టీం పై ఘన విజయం సాధించిన పింక్ టీం. అద్భుత బౌలింగ్ ప్రదర్శన కనబర్చి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్న మొహమ్మద్ అల్వాన్.

## నకిలీ మద్యం వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు

రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టిస్తున్న ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అశోక్ కుమార్ ఈ బృందానికి నేతృత్వం వహిస్తారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.సిట్ సభ్యులుగా ఐపీఎస్ అధికారులు రాహుల్ దేవ్ శర్మ (ఎక్సైజ్ శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్), కె. చక్రవర్తి (సీఐడీ ఎస్పీ), మల్లికా గార్గ్ (ఆర్టీజీఎస్)లను నియమించినట్టు తెలిపారు. ఎక్సైజ్ శాఖ నుంచి ఈ అంశంపై పూర్తి అవగాహన ఉన్న ఒక నిపుణుడిని కూడా బృందంలో చేర్చుతామని ఆయన వివరించారు.

## చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూత

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ హైదర్‌గూడలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో ఇవాళ ఉదయం 5.30 గంటలకు తుది శ్వాస విడిచారు. మధ్యాహ్నం 3 గంటలకు మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. కాంగ్రెస్ నేత అయిన కొండా లక్ష్మారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ సీఎం కొండా వెంకట రంగారెడ్డికి మనమడు. తాత ఆశయాలతో రాజకీయ జీవితంలోకి వచ్చిన ఆయన ఏపీసీసీ ప్రతినిధి, గ్రీవెన్స్ సెల్ చైర్మన్‌తో సహా వివిధ పదవులను నిర్వహించారు. ఏపీ క్రీడా మండలి చైర్మన్‌గా కూడా పనిచేశారు. 1999, 2014లో హైదరాబాద్ నుంచి కూడా పోటీ చేశారు. ఇక కొండా లక్ష్మారెడ్డికి జర్నలిజం మీద కూడా మక్కువ ఎక్కువ. అందుకే 1980లో ఆయన స్థానిక వార్త సంస్థ NSS ను ప్రారంభించారు. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడిగా పనిచేశారు.

## ఇజ్రాయెల్‌కు బయల్దేరి వెళ్లిన ట్రంప్..

# గాజాలో యుద్ధం ముగిసిందంటూ ప్రకటన

ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. తొలి దశ శాంతి ఒప్పందంలో భాగంగా హమాస్ నేడు ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా గాజాలో యుద్ధం ముగిసినట్లు ప్రకటించారు. మానంలో బయలుదేరే ముందు రిపోర్టర్లతో ట్రంప్ మాట్లాడుతూ.. 'గాజాలో యుద్ధం ముగిసింది. ఇక పశ్చిమాసియాలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని భావిస్తున్నాను' అంటూ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదన, ఒత్తిడి మేరకు ఇజ్రాయెల్‌తో 20 అంశాల ప్రణాళికకు పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ అంగీకరించడంలో రెండు రోజుల క్రితమే ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం ప్రారంభమైంది. ఈ ఒప్పందంలో భాగంగా నేడు ఇజ్రాయెల్ బందీలను హమాస్ విడుదల చేయనుంది. మరికాసేపట్లో బందీలు హమాస్ చెర నుంచి బయటపడనున్నారు. నేడు ట్రంప్ ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించనున్నారు. ఆ తర్వాత బందీలను పరామర్శించనున్నారు.

### నేను యుద్ధాలు ఆపడంలో నిపుణుడిని.. ఇక పాక్-ఆఫ్ఘాన్ వార్ సంగతి చూస్తా : ట్రంప్

గాజాలో గత రెండేండ్లుగా సాగుతున్న యుద్ధం ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధాలు



ఆపడంలో తాను నిపుణుడిని అంటూ చెప్పుకున్నారు. ఇప్పటికే ఏడు యుద్ధాలు ఆపిన తాను.. గాజాలో నేను ఆపింది ఎనిమిదో యుద్ధం అంటూ చెప్పుకొచ్చారు. ఇక పాక్-ఆఫ్ఘాన్ యుద్ధం సంగతి చూస్తా అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.